# సాక్షి సంగారెడ్డి

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025






**శిథిలమై.. మూతబడి**

శిథిలావస్థకు చేరుకున్న స్కూల్ పాతభవనం పైనుంచి పెచ్చులూడుతుండటంతో మూతబడింది. వివరాలు 8లో ▸



**నేడు గణేశ్ నిమజ్జనం**

శనివారం జిల్లాలో నిర్వహించనున్న గణేశ్ నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివరాలు 8లో ▸



**ఎన్నాళ్లకెన్నాళ్లకు..**

సరైన బస్టాండ్ లేకుండా అవస్థలు పడ్డ ప్రయాణికులకు రాయికోడ్ బస్టాండ్ వినియోగంలోకి వచ్చింది. వివరాలు 9లో ▸

## న్యూస్‌రీల్

### కేతకీలో హైకోర్టు సిట్టింగ్ జడ్జి



జడ్జి కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

**ఝరాసంగం(జహీరాబాద్):** హైకోర్టు సిట్టింగ్ జడ్జి, సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ జ్యూడిషియల్ సభ్యురాలు లతా బస్వరాజ్ పట్నే, కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం శ్రీకేతకీ సంగమేశ్వరాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయాధికారులు, అర్చకులు వీరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అమృతగుండంలో జలలింగానికి పూజలు చేశారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను అర్చకులు అందించి, సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హన్మంత్‌రావు పాటిల్, పాలక మండలి చైర్మన్ చంద్రశేఖర్‌పాటిల్, ఆలయ ఈఓ శివ రుద్రప్ప, జహీరాబాద్ రూరల్ సీఐ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

### జీఎస్టీ తగ్గింపుతో మేలు



మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నేతలు

**నారాయణఖేడ్:** జీఎస్టీ తగ్గింపు ద్వారా ధరలు తగ్గి పేదలకు మేలు జరిగేలా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కృషి చేశారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్తిరి రామకృష్ణ పేర్కొన్నారు. జీఎస్టీ ద్వారా ధరలను తగ్గించినందుకు గాను శుక్రవారం ఖేడ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బీజేపీ పేదల అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో రాబోయే ప్రభుత్వం బీజేపీ దేనని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో ఖేడ్ మండలశాఖ అధ్యక్షుడు దశరథ్, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, నాయకులు సుగుణాకర్, మానిక్, సాయేందర్, సిద్ధయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

### సింగూరుకు కొనసాగుతున్న వరద

**పుల్‌కల్(అందోల్):** సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. రెండు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. ఎగువ నుంచి 25,010 క్యూసెక్కులు వస్తుండగా...అంతే నీటిని దిగువకు విడిచిపెడుతున్నారు. జలవిద్యుత్ కేంద్రానికి 2,250 క్యూసెక్కులు వదులుతుండగా రెండు టర్బయిన్‌లతో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం డ్యామ్‌లో 16.500 టీఎంసీల నీటిని నిల్వ ఉంచారు.

### దేశ భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులే

**మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి**

**సంగారెడ్డి టౌన్ :** ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి సంపన్నులని మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి మండలంలోని ఎమ్మెన్నార్ కళాశాలలో టీచర్స్ డే వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని దేశాభివృద్ధికి జాతి నిర్మాణానికి కీలకమన్నారు. టీచర్ల వల్లే ప్రతీ విద్యార్థి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదుగుతున్నారన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి రూ.25 లక్షల నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెన్నార్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఎం.ఎన్.రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గింజపై గణపతి



సూక్ష్మ చిత్రాలను రూపొందించడంలో ఆరితేరిన రిటైర్డ్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి మర్రి మొగులయ్య తాజాగా వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొక్కజొన్న గింజపై బొజ్జ గణేశుడిని చిత్రించి ఇలా తన భక్తి భావాన్ని చాటుకున్నారు. ఈ కళారూపాన్ని చూసి స్థానికులు మురిసిపోతున్నారు.

పటాన్‌చెరు:





హైదరాబాద్ శిల్పారామంలో యోగితా రాణా చేతుల మీదుగా అవార్డునందుకుంటున్న ఉపాధ్యాయులు డాక్టర్ సదయకుమార్, వాకిట శ్రీదేవి, విద్యాసాగర్



# ఉత్తములకు పురస్కారం

**సంగారెడ్డి ఎడ్యుకేషన్ /జిన్నారం:** రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు విద్యాసాగర్, డాక్టర్ సదయ్‌కుమార్, వాకిట శ్రీదేవిలను శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఘనంగా సన్మాంచి అవార్డులను ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవంలో ఉత్తమ ఉపాధ్యాయులకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా, విద్యాశాఖ డైరెక్టర్ నికోలస్‌లు అవార్డులు అందజేశారు. సంగారెడ్డి జిల్లాలో ప్రధానోపాధ్యాయుడి విభాగంలో ఎంపికైన విద్యాసాగర్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీఎస్‌ఆర్ నిధుల ద్వారా పలు పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక విభాగంలో ఎంపికైన డాక్టర్ సదయ్‌కుమార్ విద్యార్థులకు నూతన పద్ధతుల్లో బోధన చేయడంతోపాటు ఎన్‌సీసీ ద్వారా విద్యార్థులను సేవా కార్యక్రమాల వైపు నడిపిస్తున్నారు. గుమ్మడిదల పట్టణ పరిధిలోని అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు వాకిట శ్రీదేవి బోధనలో విద్యార్థులకు ఆసక్తికరంగా బోధన చేయడంతోపాటు పలు సేవాకార్యక్రమాలు చేస్తున్నందుకుగాను ఉత్తమ అవార్డుకు ఎంపికైన సంగతి తెలిసిందే.

# అమీన్‌పూర్‌లోనే నవోదయ

- రూ.1,500కోట్లతో పాఠశాల ఏర్పాటు
- కేంద్రాన్ని ఒప్పించిన ఎంపీ రఘునందన్
- వారం రోజుల్లో స్థల పరిశీలన



అభిజిత్ బెహ్రాతో రఘునందన్

**పటాన్‌చెరు:** సంగారెడ్డి జిల్లాకు నవోదయ పాఠశాల మంజూరైంది. రూ.15 వందల కోట్లతో అమీన్‌పూర్‌లో ఏర్పాటు చేయనున్నారు. నవోదయ పాఠశాల ఏర్పాటు అంశంపై ఏర్పడిన సస్పెన్స్‌కు తెర పడింది. ఎంపీ రఘునందన్‌రావు సాక్షితో ఫోన్‌లో మాట్లాడుతూ నవోదయ పాఠశాల మంజూరు అంశంపై వివరాలను వెల్లడించారు. ఢిల్లీలో శుక్రవారం నవోదయ పాఠశాల డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బెహ్రాను కలిసి నవోదయ పాఠశాలను సంగారెడ్డి జిల్లాలోనే ఏర్పాటు చేయాలని తాను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. తన విజ్ఞప్తిని ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. పాఠశాల నిర్మాణం, తాత్కాలిక వసతి సదుపాయాలపై సమగ్రంగా చర్చించామన్నారు. అమీన్‌పూర్‌లోనే పాఠశాల ఏర్పాటు చేసేందుకు డిప్యూటీ కమిషనర్‌ను ఒప్పించినట్లు ఎంపీ తెలిపారు. రూ.1500 కోట్లతో నిర్మించే ఈ పాఠశాలకు ప్రతిఏటా రూ.500 కోట్ల చొప్పున మూడేళ్ల నిధులు విడుదల కానున్నట్లు తెలిపారు. భవన నిర్మాణం పూర్తయ్యేలోగా ప్రైవేట్ భవనాన్ని అద్దెకు తీసుకుని తాత్కాలిక వసతి కల్పిస్తామన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో పాఠశాల ప్రారంభం అయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. అమీన్‌పూర్‌లో కేటాయించనున్న స్థలాన్ని పరిశీలించేందుకు అధికారులు వచ్చే వారం క్షేత్ర స్థాయిలో పరిశీలించనున్నారని రఘునందన్ వివరించారు. నవోదయ పాఠశాలను జిల్లాకు కేటాయించినందుకు ఆయన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# త్వరలో 8వేల పోస్టుల భర్తీ

- పేదలందరికీ మెరుగైన ఉచిత వైద్యం
- అన్ని ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు
- మంత్రి దామోదర రాజనర్సింహ
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



ఉపాధ్యాయులను సన్మానించిన మంత్రి దామోదర, ఎంపీ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి



అర్బన్ పార్కు ఏర్పాటు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి

**నారాయణఖేడ్:** పేద ప్రజలందరికీ మెరుగైన ఉచిత వైద్యం అందించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శుక్రవారం ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి రూ.1.15 కోట్లతో నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని కన్వెన్షహాలు విస్తరణ, సదుపాయాలు, రూ.3.9 కోట్లతో అర్బన్ పార్కు ఏర్పాటు, ఖేడ్ చుట్టూ సీసీతో రింగ్‌రోడ్డు, మనూరు మండలం డోవూరు నుంచి ఎల్గొయి, అతిమ్యాల్ మీదుగా ఎన్.జి. హుక్రానా వరకు రూ.6 కోట్లతో తారురోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా మెరుగైనా వైద్య అందేలా చర్యలు చేపట్టామన్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో 9 వేల పోస్టులను భర్తీ చేశామని, మరో 8 వేల పోస్టుల భర్తీకి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, పోస్టుల భర్తీతో కార్పొరేట్ అసుపత్రులకు దీటుగా అభివృద్ధి చేస్తామన్నారు. అర్బన్ పార్కు అటవీ సంరక్షణతోపాటు జనాలకు ఆహ్లాదం, ఆరోగ్యం కోసం దోహదపడుతుందన్నారు. ఎంపీ సురేష్ షెట్కార్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన ఖేడ్‌ను విద్య, వైద్యరంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ నల్లవాగు ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా మార్చాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టరు చంద్రశేఖర్, సబ్ కలెక్టర్ ఉమాహారతి, డీఎఫ్ శ్రీధర్‌రావు, డీఎంఅండ్‌హెచ్ఓ నాగనిర్మల, మున్సిపల్ కమిషనరు జగ్జీవన్ పాల్గొన్నారు.

**విద్యా, వైద్యరంగాలకు ప్రాధాన్యం**

ప్రభుత్వం విద్యా, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని దామోదర తెలిపారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులైన ఐదుగురిని, డివిజన్ స్థాయిలో ఎంపికైన 70 మందిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

**వైద్య రంగాన్ని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్**

**కల్హేర్(నారాయణఖేడ్):** వైద్యరంగాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వ భ్రష్టు పట్టించిందని మంత్రి విమర్శించారు. సిర్గాపూర్‌లో పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్పత్రుల్లో వసతులు కలిపించామని తెలిపారు.

**జగ్గన్నా.. వైద్యసేవలను పర్యవేక్షించండి**

**సంగారెడ్డి:** జిల్లా కేంద్ర ఆస్పత్రి, మెడికల్ కళాశాలను పది రోజులకోసారి సందర్శించి వైద్యసేవలను పర్యవేక్షించాలని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి మంత్రి దామోదర సూచించారు. ఇంకా ఏమైనా అవసరాలుంటే నివేదిక ఇవ్వాలన్నారు. వైద్య కళాశాల, నూతన భవనాలు, హాస్టల్ భవనం, క్రిటికల్ కేర్ యూనిట్లు వంటి వాటిని పరిశీలించాలని సూచించారు.

## బైబై గణేశా..



జహీరాబాద్‌లోని నారింజ ప్రాజెక్టు వద్ద గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా ముగిసింది. నిమజ్జన కార్యక్రమంలో యువత, పిల్లలు ఉత్సాహంగా పాల్గొని చిందులు వేశారు. జహీరాబాద్ టౌన్

# భెల్ కార్మిక నేత కన్నుమూత

- రెండుసార్లు కార్మిక రత్న అవార్డు అందజేత
- తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఎల్లయ్య
- కేటీఆర్, హరీశ్‌రావు సంతాపం



ఎల్లయ్య

**రామచంద్రాపురం(పటాన్‌చెరు):** బీహెచ్ఈఎల్ కార్మిక నేత, తెలంగాణ ఉద్యమకారుడు జి.ఎల్లయ్య (84) శుక్రవారం కృష్ణారెడ్డిపేటలోని తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. మెదక్ జిల్లా అక్కన్నపేటకు చెందిన ఎల్లయ్య.. 1967లో బీహెచ్ఈఎల్ పరిశ్రమలో ఎలక్ట్రీషియన్‌గా ఉద్యోగంలో చేరారు. ఐఎన్‌టీయూసీ తరఫున కార్మిక సంఘం ఎన్నికల్లో 9 సార్లు విజయం సాధించారు. 1969 తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారు. కేసీఆర్ పిలుపు మేరకు మలిదశ ఉద్యమంలో పాల్గొన్నారు. 1999లో కాంగ్రెస్ తరఫున సంగారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం వచ్చినా.. కార్మికులకు సేవ చేయాలనే ఉద్దేశంతో వచ్చిన అవకాశాన్ని, అలాగూజజ 2009లో సైతం బీఆర్ఎస్ తరఫున పోటీ చేయాలని కేసీఆర్ సూచించినా సున్నితంగా తిరస్కరించారు. హౌసింగ్ సొసైటీలను ఏర్పాటు చేసి తక్కువ ధరకే కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా కార్మికులకు సొంత ఇంటి కలను నిజం చేశారు. కార్మికులకు చేసిన సేవలకు గుర్తింపుగా రెండు సార్లు కార్మికరత్న అవార్డు అందుకున్నారు. కాగా, ఎల్లయ్య అంత్యక్రియలు శనివారం రామచంద్రాపురం శ్మశానవాటికలో నిర్వహించనున్నారు.

**కేటీఆర్, హరీశ్ సంతాపం**

ఎల్లయ్య మరణం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే హరీశ్‌రావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర, కార్మికుల హక్కుల కోసం చేసిన పోరాటాలు అమోఘమని కొనియాడారు. సాధారణ కార్మికుడిగా జీవితం ప్రారంభించి.. భెల్ కార్మికులందరికీ ఒక బలమైన గొంతుకగా మారిన ఎల్లయ్య జీవితం ఎంతో మందికి స్ఫూర్తినిస్తుందన్నారు. ఆయన మృతి కార్మిక లోకానికే కాకుండా తెలంగాణ సమాజానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఎల్లయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## అలయ్ బలయ్‌కు రండి

**జగ్గారెడ్డికి దత్తాత్రేయ ఆహ్వానం**

**సాక్షిప్రతినిధి, సంగారెడ్డి :** హైదరాబాద్‌లో అక్టోబర్ 3న జరగనున్న అలయ్ బలయ్ కార్యక్రమానికి రావాల్సిందిగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని హరియాణ మాజీ గవర్నర్, బీజేపీ సీనియర్ నాయకులు బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం సంగారెడ్డిలోని జగ్గారెడ్డి నివాసానికి వచ్చి ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా దత్తాత్రేయ రాసిన 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని కూడా అందించారు. ఇటీవల వివాహమైన జగ్గారెడ్డి కుమార్తె జయారెడ్డి-గుణచైతన్యరెడ్డి దంపతులకు దత్తాత్రేయ నూతన వస్త్రాలు పెట్టి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయతో తన కున్న అనుబంధాన్ని జగ్గారెడ్డి గుర్తు చేసుకున్నారు. పార్టీలకతీతంగా దత్తాత్రేయ చేస్తున్న సేవలను స్ఫూర్తిగా తీసుకుని తాను కూడా నియోజకవర్గంలో సేవలు చేస్తున్నానని తెలిపారు.

# కోడ్ కూయక ముందే..

**ప్రజాప్రతినిధుల వడివడి అడుగులు**

- అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- స్థానిక నగారా మోగే అవకాశం
- నియోజకవర్గాల్లో విస్తృత పర్యటనలు

**సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి:** ప్రజాప్రతినిధులు, నేతలు అభివృద్ధి పనులపై దృష్టి సారించారు. తమ నియోజకవర్గాల్లో ఈ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వచ్చే అవకాశాలు ఉండటంతో వీలైనంత ఎక్కువ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్ల వచ్చని బావిస్తున్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం ఒక్కరోజులోనే రూ.514 కోట్ల పనులకు శ్రీకారం చుట్టారు. రూ.273 కోట్ల వ్యయంతో నిర్మించిన 500 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన, రూ.186 కోట్లతో నిర్మించిన వైద్య కళాశాల భవన ప్రారంభోత్సవం నిర్వహించారు. రూ.23 కోట్లతో క్రిటికల్ కేర్ విభాగాన్ని కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించాలని భావించారు. సీఎం పర్యటన ఇప్పట్లో ఖరారయ్యే అవకాశాలు లేకపోవడంతో జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి ప్రారంభించారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆందోల్ నియోజకవర్గంలోనూ ఈ శంకుస్థాపనలు జరిగాయి. పీహెచ్‌సీలు, పాఠశాలల భవనాలు, బస్సుషెల్టర్ ఇలా ఒక్క రోజులోనే 11 పనులను ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోనూ టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డితో కలిసి జగ్గారెడ్డి కొత్త ప్రాజెక్టులపై దృష్టి సారించారు. రూ.500 కోట్లతో మహబూబ్‌సాగర్ సుందరీకరణతో పాటు, రాజీవ్ పార్కు అభివృద్ధి పనులు, సంగారెడ్డికి తాగునీటి పథకం ఫిల్టర్‌బెడ్ ఆధునీకరణ పనులు.. ఇలా పలు ప్రాజెక్టులపై జిల్లా కలెక్టర్, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులతో చర్చించారు.

**కొనసాగుతున్న ఎన్నికల ప్రక్రియ**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాగం ఏర్పాట్లు చేసుకుంటూ వెళుతోంది. ఈ ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితాను మంగళవారం ప్రకటించిన విషయం విదితమే. అలాగే బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది జాబితాల రూపకల్పన ఇలా.. ఎన్నికలకు ముందస్తు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో త్వరలో ఎన్నికల నగారా మోగే అవకాశాలు ఉండటంతో ఆయా నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, నేతలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై దృష్టి సారించడం చర్చనీయాంశంగా మారుతోంది.

**నారాయణఖేడ్‌లో..**

నారాయణఖేడ్‌లోనూ స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కార్యక్రమాలను శుక్రవారం శ్రీకారం చుట్టారు. అటవీ శాఖకు సంబంధించిన అర్బన్‌పార్కు, నారాయణఖేడ్ రింగ్‌రోడ్డు పనులకు మంత్రి దామోదర రాజనర్సింహ శ్రీకారం చుట్టారు. సిర్గాపూర్ పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించారు. మరోవైపు ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు వంటి సంక్షేమ పథకాలకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టారు. పటాన్‌చెరులో స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఇటీవల కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

# డీడీఎస్-కేవీకేకు 4 అవార్డులు

● అటారీ జోన్-10 వార్షిక వర్క్‌షాప్‌లో ఎంపిక ● అవార్డు అందుకున్న శాస్త్రవేత్త వరప్రసాద్



వార్షిక వర్క్‌షాప్‌లో అవార్డులు అందుకుంటున్న డీడీఎస్-కేవీకే సీనియర్ శాస్త్రవేత్త సి.వరప్రసాద్

**జహీరాబాద్:** తమిళనాడు రాష్ట్రంలోని వెల్లూరులో అటారి జోన్-10 పరిధిలోని 72 కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక జోనల్ వర్క్‌షాప్‌లో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని డీడీఎస్-కేవీకేకు నాలుగు అవార్డులు లభించాయి. నాలుగు విభాగాల్లో లభించిన అవార్డులను డీడీఎస్-కేవీకే సీనియర్ శాస్త్రవేత్త సి.వరప్రసాద్ వెల్లూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులను అందుకున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు వెల్లూర్‌లో కేవీకేల సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు, చిక్కుడులో అధిక దిగుబడి సాధించడం, అడవి పందుల నివారణకు పరికరం అమర్చడం, పెరటి కోళ్లపెంపకంలో సాధించిన విజయాలకు గాను అవార్డులు దక్కాయి. మట్టి ఆరోగ్య కార్డులు, మట్టి శాస్త్రంపై ఆధారపడి సమగ్ర పోషక పదార్థాల నిర్వహణను ప్రోత్సహించడంలో విశిష్ట ప్రతిభ కనబర్చినందుకు గాను ప్రత్యేక అభినందన పత్రాన్ని డీడీఎస్-కేవీకే అందుకుంది. ఉత్తమ విజయ గాథల విభాగం, ఉత్తమ బాక్స్ ఐటమ్స్ కంటెంట్ విభాగంలో రెండో స్థానం దక్కించుకుంది. అత్యధిక భూమి ఆరోగ్య కార్డులు జారీ చేసిన విభాగంలో మూడో స్థానంలో నిలిచింది. 2024 సంవత్సరంలో డీడీఎస్-కేవీకేలో సుమారు 2వేల మట్టి శాంపిళ్లను విశ్లేషించి రైతులకు ఉచితంగా మట్టి ఆరోగ్య కార్డులను అందజేశారు. నాలుగేళ్లుగా ఈ కేంద్రం నిరంతరం మట్టి ఆరోగ్య కార్డుల విభాగంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోంది.

**విజయగాథలు**

**అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు**

- కంగ్టి మండలం నాగూర్(కె) గ్రామంలో డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తల పరిచయం ద్వారా రైతులు అధిక సాంద్రత (హెచ్‌డీపీఎస్) పద్ధతిలో పత్తి పంటను సాగు చేశారు. దీంతో 23 శాతం దిగుబడుల పెరుగుదలతో పాటు నికర ఆదాయం పెంచుకోగలిగారు.
- తీగ చిక్కుడులో అధిక దిగుబడి జాతి అయిన ఆర్కఅమోఘ్ రకం సాగు చేసిన జహీరాబాద్‌కు చెందిన రైతు ప్రతాప్‌రెడ్డి హెక్టారుకు 30 శాతం దిగుబడిని పెంచుకున్నాడు. -అడవి పందుల నియంత్రణకు జహీరాబాద్ మండలం లచ్చునాయక్ తండాకు చెందిన రైతు రామ్ చౌహాన్ జొన్న పంటలో బయో అకౌస్టిక్స్ పరికరాలను శాస్త్రవేత్తలు అమర్చారు. దీంతో అడవి పందుల వల్ల కలిగే నష్టాన్ని విజయవంతంగా తగ్గించారు.
- ఎస్సీ సబ్‌ప్లాన్ పథకంలో భాగంగా ఝరాసంగం మండలం పొట్‌పల్లికి చెందిన దళిత మహిళా రైతు పూలమ్మకు డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు పెరటి కోళ్లను అందజేశారు. 90 రోజుల పెంపకంలో సుమారు రూ.6వేల ఆదాయం సమకూరడమే కాకుండా గుడ్ల ద్వారా పోషకాహారాన్ని కూడా పొందారు. ఈ విజయాలతో జహీరాబాద్‌లోని డీడీఎస్-కృషి విజ్ఞాన కేంద్రం జాతీయ వేదికపై మరో మారు తన ప్రతిభను చాటుకుంది.

## మెరుగైన ఐఐటీహెచ్ ర్యాంకింగ్

- ఇంజనీరింగ్‌లో 7వ స్థానం
- తొలితరం ఐఐటీలను దాటి..



**సాక్షిప్రతినిధి, సంగారెడ్డి :** కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్)లో హైదరాబాద్ ఐఐటీ మెరుగైన ర్యాంకింగ్‌ను సాధించింది. మొట్టమొదటిసారి తొలితరం ఐఐటీలను దాటివేసింది. ఇంజనీరింగ్ విభాగంలో గతేడాది (2024లో) దేశంలోనే 8వ ర్యాంకు ఉండగా, ఈసారి 7వ స్థానానికి చేరింది. నూతన ఆవిష్కరణలో 6వ ర్యాంకు సాధించింది. పరిశోధనల్లో 15వ ర్యాంకు, ఓవరాల్ ర్యాంకింగ్‌లో 12వ ర్యాంకు వచ్చింది. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి మాట్లాడుతూ..ఆత్మనిర్భర్‌భారత్, డిజిటల్ ఇండియా, వికసిత భారత్-2047 వంటి జాతీయ మిషన్‌లలో లక్ష్యాలను చేరుకునేందుకు తోడ్పాటునందించేందుకు సంస్థను తీర్చిదిద్దుతున్నామన్నారు. సెమీ కండక్టర్లు, సస్టైనబుల్ ఎనర్జీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల్లో పరిశోధనలను మరింత ముందుకు తీసుకెళతామన్నారు.

## క్లుప్తంగా

### వాహన పూజా షెడ్డు ప్రారంభం



అమ్మవారికి బంగారు నెక్లెస్‌ను అందజేస్తున్న దాత శ్రీనివాస్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల్లో వాహన పూజ కోసం భక్తుడు ఏర్పాటు చేసిన షెడ్డును శుక్రవారం ప్రారంభించారు. గొల్లపల్లికి చెందిన లోకేశ్వర్ శ్రీనివాస్ రెడ్డి తన తల్లి యశోద జ్ఞాపకార్థం వాహన పూజ కోసం షెడ్డును ఏర్పాటు చేయడంతో పాటు దుర్గమ్మ తల్లికి 57 గ్రాము ల బంగారు నెక్లెస్‌ను చేయించారు. రూ.2.60 లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్డును ప్రారంభించి, ఆలయ సిబ్బందికి నెక్లెస్‌ను అందజేశారు.

### పోచారం సందర్శన బంద్



అభయారణ్యంలో కొట్టుకుపోయిన రోడ్డు

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని పోచారం శివారులో ఉన్న పోచారం అభయారణ్యానికి వన్యప్రాణుల సంరక్షణ కేంద్రంలో పర్యాటకులను అనుమతించడం లేదు. గతంలో కురిసిన వర్షాలతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై పక్కనే ఉన్న పోచారం డ్యామ్ నీరు రావడంతో వాహనాలు వెళ్లలేని విధంగా తయారైంది. దీంతో వారం రోజులుగా పర్యాటకులను అనుమతించడం లేదు. త్వరలో రోడ్డు బాగు చేయించిన తర్వాత అనుమతి కల్పించనున్నట్లు ఫారెస్టు అధికారులు పేర్కొన్నారు.

### ఐదు ట్రిప్పుల ఇసుక చోరీ



ఇసుకను అపహరించిన ఆనవాళ్లు

కొండపాక(గజ్వేల్): తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఇసుకలోంచి సుమారు ఐదు ట్రిప్పులు చోరీకి గురైంది. ఈ ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా... మండలంలోని వివిధ చోట్ల నుంచి అక్రమంగా ట్రాక్టర్లలో తరలిస్తున్న ఇసుకను టాస్క్‌ఫోర్స్, లోకల్ పోలీసులు పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగించారు. ఆ ఇసుకను తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో కుప్పగా పోశారు. ఈ క్రమంలో కుప్పలోంచి సుమారు 4 నుంచి 5 ట్రిప్పుల ఇసుకను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. నిత్యం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్న కార్యాలయం వద్ద ఇసుక దొంగతనం జరగడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

### గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

నర్సాపూర్ రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై లింగం వివరాల ప్రకారం... పట్టణంలో మెదక్‌కు చెందిన కుక్కల శివకుమార్, మేడ్చల్ జిల్లా బహదూర్‌పల్లికి చెందిన చింతకుంట ప్రేమ్‌కుమార్ అనుమానాస్పదంగా తిరుగుతూ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా వారి వద్ద 60 గ్రాముల గంజాయి దొరికింది. గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

### మహిళ మెడలో గొలుసు అపహరణ

జిన్నారం (పటాన్‌చెరు): మహిళ మెడలో నుండి బంగారు గొలుసును దుండగుడు అపహరించాడు. ఈ ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా చర్చి గాగిల్లాపూర్‌లో నివాసముండే పాసాల మోషిని (39) చెట్లపోతారంలోని ఓ కంపెనీలో పని చేస్తుంది. రోజుమాదిరిగా గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో పనులు ముగించుకొని కాలినడకన ఇంటికి వస్తుంది. కొద్ది దూరం వెళ్లగానే ఆమె వెనకాల వస్తున్న ఇరవై ఏళ్ల యువకుడు కింద పడిపోయాడు. ఆ యువకుడికి సాయం చేసేందుకు వెళ్లిన ఆమెను చర్చి గాగిల్లాపూర్‌కు ఎలా వెళ్లాలి అని అడిగాడు. నేను అటువైపే వెళుతున్నానని కింద పడిన యువకుడిని పైకి లేపింది. ఈ క్రమంలో ఆమె మెడలో ఉన్న 2.5 గ్రాముల బంగారు గొలుసును లాగే క్రమంలో అడ్డుకునే ప్రయత్నం చేసింది. అయినా దుండగుడు గొలుసుతో పరారయ్యాడు.



# శిథిలమై.. మూతబడి

మల్‌చెల్మలో షిఫ్టు పద్ధతిలో తరగతుల నిర్వహణ

- పడిపోతున్న విద్యాప్రమాణాలు
- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- పట్టించుకోని అధికారులు

**పాఠశాల భవనం శిథిలమై పెచ్చులూడుతున్నాయి. తరగతి గదులు ఎప్పుడైనా కూలే ప్రమాదం ఉందన్న భయంతో స్కూల్‌ను మూసేశారు. ఉర్దు మీడియం ప్రాథమిక పాఠశాల బిల్డింగ్‌లోకి స్కూల్‌ను మార్చారు. షిఫ్టు పద్ధతిలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఒంటిపూట బడి కారణంగా పాఠాలు అర్థం కాక విద్యాప్రమాణాలు పడిపోతున్నాయి. కాగా మల్‌చెల్మలో నూతన భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.**

– జహీరాబాద్ టౌన్:



శిథిలావస్థకు చేరిన మల్‌చెల్మ పాఠశాల భవనం

జహీరాబాద్ మండలంలోని మల్‌చెల్మ గ్రామంలో 1969లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం నిర్మించారు. 6 నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఉర్దు మీడియంలో విద్యా బోధన జరుగుతుంది. సుమారు 200 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాలలో 16 గదులు ఉండగా దశాబ్దాల కాలం క్రితం నిర్మించిన కారణంగా వాటిలో 14 గదులు పూర్తిగా దెబ్బతిని శిథిలమయ్యాయి. భవనం గోడలు బీటలు వారి పైకప్పు పెచ్చులు ఊడి స్లాబ్ కూలుతుంది. వర్షం కురిస్తే చాలు తరగతి గదుల్లో నీరు వచ్చి చేరుతుంది. ఏ క్షణమైనా కూలుతుందన్న భయంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉన్నత పాఠశాలను ప్రైమరీ స్కూల్ బిల్డింగ్‌లోకి తరలించి, నాలుగేళ్ల నుంచి షిఫ్టుల పద్ధతిలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి 12.30 గంటల వరకు ప్రైమరీ, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఒంటిపూట బడి నడుస్తుంది.



ఊడిపడుతున్న పైకప్పు పెచ్చులు

#### నష్టపోతున్న విద్యార్థులు

షిఫ్టుల పద్ధతితో ఉన్నత పాఠశాల విద్యార్థులు నష్టపోతున్నారు. సమయం తక్కువగా ఉండటం వల్ల పాఠాలు అర్థం కావడం లేదని, దూర ప్రాంతాల నుంచి రాకపోకలకు కష్టమవుతుందని విద్యార్థులు వాపోతున్నారు. ఒంటిపూట వల్ల పిల్లలు ఇంటి వద్దనే ఉంటున్నారని, ఆటలాడటం వల్ల చదవుపై శ్రద్ధ పెట్టడం లేదని తల్లిదండ్రులు టీసీలు తీసుకెళుతున్నారు. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గింది. విద్యార్థుల సంఖ్య 300 నుంచి ప్రస్తుతం 200 మందికి వచ్చింది. 2012 సంవత్సరంలో హైస్కూల్‌కు నూతన భవనం కోసం రూ. 2 కోట్లు మంజూరయ్యాయి. నూతన భవన నిర్మాణం కోసం రెండెకరాల స్థలం కూడా ఎంపిక చేశారు. ఏమైందో ఏమో తెలియదు కానీ ఇంత వరకు నిర్మాణ పనులకు ముందడుగు పడలేదు. నిధులు రద్దు కాగా ఆ తరువాత పాఠశాల గురించి పట్టించుకునే వారు కరువయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. కలెక్టర్ శ్రద్ధ తీసుకుని మల్‌చెల్మ పాఠశాలకు నూతన భవనాన్ని కట్టించాలని కోరుతున్నారు.

# వామ్మో ఇదేం భోజనం?

- హాస్టల్‌లో కుళ్లిన కూరగాయలతో వంటలు
- నిత్యం తనిఖీలు చేస్తున్నా కానరాని మార్పు
- చర్యలు తీసుకోవాలి: విద్యార్థుల తల్లిదండ్రులు



హాస్టల్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్త

సిద్దిపేటఅర్బన్: సంక్షేమ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు ప్రభుత్వం చెప్పిన విధంగా కామన్ డైట్ అందించడంతో పాటు రుచికరమైన భోజనాన్ని అందించాలని నిత్యం కలెక్టర్ హాస్టళ్లలో తనిఖీలు చేస్తున్నారు. అయినా కొందరు ప్రిన్సిపాల్స్‌కు, వంట సిబ్బందికి అవేం పట్టడం లేదు. వివరాలు ఇలా... సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్‌లో శుక్రవారం కొందరు గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్‌ను విజిట్ చేయగా కుళ్లిపోయిన కూరగాయలు, పురుగులు పట్టిన బీరకాయలు దర్శనమిచ్చాయి. హాస్టల్ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రతతో నిండిపోయాయి. దోమతెరలు లేకపోవడంతో నిద్రించే సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదని, చాలామంది అనారోగ్యం పాలవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్లు గడుస్తున్నా విద్యార్థినులకు దుస్తులు, ట్రంక్ పెట్టెలు ఇవ్వలేదన్న ఆరోపణలున్నాయి. ప్రిన్సిపాల్ విద్యార్థినిల పట్ల దురుసుగా వ్యవహరిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. నిత్యం హాస్టళ్లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఈ హాస్టల్‌పై దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.




కుళ్లిన బీరకాయ, సొరకాయను చూపిస్తున్న దృశ్యం

## ఆన్‌లైన్‌లో దుస్తులు కొనేందుకు యత్నం..

రూ.98 వేలు పోగొట్టుకున్న వ్యాపారి



పటాన్‌చెరు టౌన్: ఆన్‌లైన్‌లో దుస్తులు కొనేందుకు యత్నించిన ఓ వ్యాపారిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. పోలీసుల వివరాల ప్రకారం... పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్‌కు చెందిన ఓ బట్టల వ్యాపారి జులై 23న ఆన్‌లైన్‌లో బట్టలు కొనేందుకు సెర్చ్ చేస్తూ, తన ఫోన్‌నంబర్‌ను కొన్ని సైట్లలో నమోదు చేశాడు. దీంతో అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి మీరు దుస్తుల కోసం సర్చ్ చేస్తున్నారు కదా.. అని బాధితుడి నుండి వివరాలు తీసుకున్నాడు. దుస్తులను పంపేందుకు రూ.98 వేలు చెల్లించాలని కోరగా.. బాధితుడు బ్యాంకు ద్వారా నగదును అపరిచిత వ్యక్తికి పంపించాడు. ఈ క్రమంలో అతడికి ఫోన్ చేయగా మెటీరియల్ ఫొటోలను పంపుతున్నానని చెబుతూ వచ్చాడు. చివరికి మోసపోయినట్టు గ్రహించి ముందుగా సైబర్ క్రైమ్, శుక్రవారం పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### బాలికపై అత్యాచార యత్నం : పోక్సో కేసు నమోదు

నారాయణఖేడ్: బాలికపై ప్రేమ పేరుతో యువకుడు అత్యాచార యత్నం చేశాడు. ఈ ఘటన మండలంలోని అంత్వార్ గ్రామశివారులో చోటుచేసుకుంది. ఎస్సై విద్యాచరణ్ రెడ్డి వివరాల ప్రకారం... న్యాల్‌కల్ మండలానికి చెందిన 16 ఏళ్ల బాలిక, సిర్గాపూర్ మండలానికి చెందిన 19 ఏళ్ల యువకుడు బంధువులు. వినాయక ఉత్సవాల్లో భాగంగా బాలిక ఖేడ్ మండలం అంత్వార్ గ్రామంలోని బంధువుల వద్దకు వచ్చింది. దీంతో ఆ యువకుడు సైతం అక్కడికి వచ్చాడు. కాగా బంధువులు రాత్రి సమయంలో వినాయక నిమజ్జనంలో ఉన్న సమయంలో యువకుడు బాలికకు ప్రేమ పేరిట మాయమాటలు చెప్పి గ్రామ శివారులోకి తీసుకెళ్లి అత్యాచారానికి యత్నించాడు. దీంతో బాలిక గాయాలపాలైంది. అక్కడి నుండి యువకుడు పారిపోయాడు. ఈ విషయం బాలిక బంధువులకు తెలువడంతో చికిత్స నిమిత్తం ఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాగరాజు

శివ్వంపేట(నర్సాపూర్): గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ మధుకర్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గంగన్నగారి నాగరాజు(37) గోమారంలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం రాత్రి పెద్దగొట్టిముక్ల నుండి గోమారానికి నడుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మి, చిన్నారులు గౌరమ్మ, గంగమ్మ ఉన్నారు.

**లారీని ఢీకొట్టిన కారు.. తప్పిన ప్రమాదం**



చిన్నశంకరంపేట(మెదక్): ప్రమాదానికి గురైన కారు

చిన్నశంకరంపేట(మెదక్): వల్లూర్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటన నార్సింగి మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు... జాతీయ రహదారిపై పెట్రోల్‌పంప్ సమీపంలో హైదరాబాద్ వైపు వెళుతున్న కారు అదుపు తప్పి ముందు వెళుతున్న లారీని వెనకవైపు నుంచి ఢీకొట్టింది. దీంతో ప్రమాదంలో కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతిన్నది. ఎయిర్ బెలూన్లు తెరుచుకోవడంతో అందులో ఉన్న వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. వారు నాగపూర్ నుంచి ఒంగోల్‌కు వెళుతున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఫిర్యాదు అందలేదని నార్సింగి ఎస్ఐ సృజన తెలిపారు.

## తల్లీకూతుళ్లు అదృశ్యం



శిరీషా



కూతుళ్లు హారిక, అద్య

తూప్రాన్: ఇద్దరు కూతుళ్లతో కలిసి తల్లి అదృశ్యమైన ఘటన మండలంలోని మల్కాపూర్‌లో శుక్రవారం జరిగింది. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చింతల మహేందర్‌కు శిరీషాతో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు. హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే పని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేందర్ ఆరోగ్యం క్షీణించడంతో రెండు నెలల క్రితం తిరిగి స్వగ్రామానికి వచ్చారు. కాగా ఈ నెల 4న గురువారం హైదరాబాద్‌లో పని ఉందని మహేందర్ భార్యతో చెప్పడంతో, తాను కూడా వస్తానని గొడవపడింది. శుక్రవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి భార్య శిరీషా, కూతుళ్లు హారిక,ఆద్యతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయింది. బంధువుల వద్ద, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# నిమజ్జనానికి వెళ్లి.. నీట మునిగి..

యువకుడు మృతి



సుధాకర్

హవేళిఘణాపూర్(మెదక్): వినాయక నిమజ్జనానికి వెళ్లి నీటిలో మునిగి యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని తొగిటలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మొండి సుజాత ప్రభాకర్ ఏకైక కుమారుడు సుధాకర్(19) యూత్ సభ్యులతో కలిసి నిమజ్జనానికి గ్రామ శివారులో ఉన్న రామస్వామి చెరువులోకి వెళ్లారు. గణేశ్‌ను నిమజ్జనం చేస్తుండగా సుధాకర్ నీటిలో మునిగిపోయాడు. దీంతో గమనించిన తోటి యువకులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు గ్రామస్తుల సహకారంతో వెతకగా మృతదేహం లభ్యమైంది. ఘటనా స్థలాన్ని ఎస్ఐ సంతోశ్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉద్యాన వర్సిటీకి దక్కని ర్యాంకింగ్



శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన యూనివర్సిటీ

సాక్షి, సిద్దిపేట: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌ఐఆర్ఎఫ్)లో సిద్దిపేటకు చెందిన శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన యూనివర్సిటీకి చోటు దక్కలేదు. 2025 సంవత్సరానికి సంబంధించిన ర్యాంకులను ఎన్ఐఆర్ఎఫ్ ఇటీవల విడుదల చేసింది. బోధన, శిక్షణ , మౌలిక వసతులు, పరిశోధన, వృత్తి నైపుణ్యం, మెలకువలు, ఉపాధి అవకాశాలు ఆర్థిక పరమైన అంశాలతో పాటు ఇతర కొలమానాలను పరిగణలోకి తీసుకుని ఈ ర్యాంకులను కేటాయిస్తారు. ఉద్యాన యూనివర్సిటీకి అనుబంధంగా మూడు కళాశాలలు, 11 రిసెర్చ్ స్టేషన్లు ఉండగా వీటికి దాదాపు 150 టీచింగ్ స్టాఫ్ ఉండాలి. కానీ 61 మంది మాత్రమే ఉన్నారు. ర్యాంక్ కేటాయించకపోవడానికి ప్రధాన కారణం ఇదే అని తెలుస్తోంది. వచ్చే ఏడాదిలో ప్రకటించే ర్యాంకింగ్ వరకైనా టీచింగ్ స్టాఫ్‌ను నియమించి , ర్యాంక్ వచ్చేలా కృషి చేయాల్సిన అవసరం ఉంది.

# సెక్యూరిటీ నియామకం.. వివాదం



డిపో ఎదుట నిరసన చేస్తున్న నిరుద్యోగ యువకులు

ఐఎంఎల్ డిపో ఎదుట నిరుద్యోగుల నిరసన

కొల్చారం(నర్సాపూర్): సెక్యూరిటీ గార్డుల నియామకంలో స్థానిక యువతకే అవకాశం కల్పించాలని ఐఎంఎల్ డిపో ఎదుట నిరుద్యోగ యువకులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. శుక్రవారం మండలంలోని చిన్నఘనాపూర్ గ్రామ శివారులోని ఐఎంఎల్ (ఇండియన్ మేడ్ లిక్కర్)డిపోలో సెక్యూరిటీ నియామకంలో అవకతవకలు జరిగాయంటూ నిరుద్యోగులు ప్రభుత్వానికి, డిపో మేనేజర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో హమాలీల నియామకంలో కొందరు, డిపో మేనేజర్ కుమ్మక్కై లక్షల రూపాయలు దండుకొని అమ్ముకున్నట్లు ఆరోపించారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఎక్సైజ్ కమిషనరేట్, ఆ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అప్పట్లో ధర్నాకు దిగడంతో నియామకాలు రద్దు చేశారని, అయితే ప్రైవేటుగా ఏ నియామకం చేపట్టినా స్థానిక యువతకు ఇచ్చేలా ఒప్పందం కుదిరిందన్నారు. కొన్ని రోజుల క్రితం డిపోలో పనిచేస్తున్న 5 మంది సెక్యూరిటీ గార్డులు పదవీ విరమణ పొందగా, వారి స్థానంలో నియామకం కోసం ఎంకే సెక్యూరిటీ సిబ్బందికి ప్రభుత్వం బాధ్యతలు అప్పజెప్పింది. ఈ నియామకాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిరసన చేస్తున్న వారిని అక్కడి నుంచి పంపించారు.

# శభాష్.. పోలీస్

- ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడి..
- కుటుంబసభ్యులకు అప్పగింత



రాజును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

మద్దూరు(హుస్నాబాద్): ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని పోలీసులు రక్షించారు. వివరాలు ఇలా... మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన ఎర్రబ్బల రాజు (46) తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని తన కుమారుడు శ్రీకాంత్‌కు ఫోన్ చేసి చెప్పి పెట్టేశాడు. దీంతో ఒక్కసారిగా కంగారు పడిన కుమారుడు తిరిగి తండ్రికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో శ్రీకాంత్ మద్దూరు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసు సిబ్బంది రాజు ఫోన్ నంబర్ తీసుకుని సిద్దిపేట ఐటీ కోర్ సహాయంతో అతడు ఉన్న లొకేషన్‌ను గుర్తించారు. కూటిగల్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో అతడ్ని గుర్తించి, తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు



ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు చెలరేగుతున్న దృశ్యం

భయంతో పరుగులు పెట్టిన స్థానికులు

నర్సాపూర్ రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ పేలి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటన మండలంలోని కాగజ్ మద్దూరులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు... గ్రామంలో పెద్ద శబ్దంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు రావడంతో చుట్టుపక్కల ఇండ్లతో పాటు గ్రామంలోని ప్రధాన దారి వెంట వెళ్లే పాదచారులు, వాహనదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడి పరుగులు పెట్టారు. స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. షార్ట్ సర్క్యూట్‌తోనే పేలి మంటలు చెలరేగినట్లు విద్యుత్ శాఖ ఏడీ రమణ రెడ్డి తెలిపారు. వెంటనే సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించి సరఫరాను పునరుద్ధరించారు.

# యూరియా నీళ్లు తాగి.. 12 మేకలు మృత్యువాత

మరో 52 అస్వస్థత



యూరియా నీళ్లు తాగి మృతిచెందిన మేకలు

వర్గల్(గజ్వేల్): యూరియా నీళ్లు తాగి 12 మేకలు మృతిచెందగా, మరో 52 అస్వస్థతకు గురయ్యాయి. ఈ ఘటన మండలంలోని గుంటిపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఒక్కో మేక రూ.20వేల విలువ ఉంటుందని, రూ. 2.40 లక్షల నష్టం వాటిల్లినట్లు భావిస్తున్నారు. స్థానిక పశువైద్యాధికారి సర్వోత్తంయాదవ్ వివరాల ప్రకారం... బొమ్మ సాయిలు, బొమ్మ పాపయ్య తదితరులకు చెందిన మేకలు మేతకు వెళ్లి తిరిగొస్తూ ఓ పొలం వద్ద చేను కోసం బకెట్లో ఉన్న యూరియా కలిపిన నీళ్లను తాగాయి. కొద్దిసేపట్లోనే ఒకటి తరువాత ఒకటి 12 మేకలు మృతిచెందగా, మరో 52 అస్వస్థతకు గురయ్యాయి. బాధితులు వెంటనే అప్రమత్తమై పశువైద్యులకు సమాచారం అందించారు. పశువైద్యాధికారి సర్వోత్తంయాదవ్, వెటర్నరీ అసిస్టెంట్ మహేందర్, గోపాలమిత్ర రాంబాబు, ఆంజనేయులు అక్కడికి చేరుకుని చికిత్స అందించారు. అస్వస్థతకు గురైన మేకలు కోలుకున్నాయని తెలిపారు.

# నేడే గణేశ్ నిమజ్జనం

ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 3వేలకు పైగా విగ్రహాల ప్రతిష్ఠాపన
- నేడు రెండువేలకు పైగా నిమజ్జనం
- 800 మంది పోలీసులతో బందోబస్తు



మహబూబ్ సాగర్ చెరువు వద్ద ఏర్పాటు చేసిన క్రేన్లు

సంగారెడ్డి జోన్: గణనాథుడి నిమజ్జనం వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తుగా అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. 11 రోజులపాటు వైభవంగా పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకోనున్నాడు. జిల్లాలో ఈ సంవత్సరం సుమారు 3వేలకు పైగా వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఇప్పటికే పలు విగ్రహాలు నిమజ్జనం జరగగా శనివారం సుమారు రెండు వేల వరకు జరగనున్నట్లు తెలుస్తుంది.

సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్ సాగర్ చెరువులో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రధాన రహదారి గుండా చెరువు కట్ట వరకు విద్యుత్ దీపాలు, బారి కేడ్లు, కట్టకు ఇరు వైపులా గ్రిల్స్, క్రేన్లు ఏర్పాటు చేశారు. కట్టపై రహదారికి తాత్కాలిక మరమ్మతులు సైతం చేపట్టారు.



చెరువు కట్టపై ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్

#### పోలీసులతో బందోబస్తు

నిమజ్జన ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు 800 మంది పోలీసు అధికారులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఉండేందుకు డైవర్షన్లు చేశారు. చెరువు వద్ద అనుకోని ప్రమాదాలు జరిగితే సహాయం కోసం గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ టీంలను అందుబాటులో ఉంచారు.

#### ప్రశాంతంగా నిమజ్జనానికి చర్యలు

గణపతి నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. 800 మంది పోలీసు బందోబస్తుతో పాటు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. శోభాయాత్ర సమయంలో నిర్వాహకులు అవసరం మేరకు అన్ని రకాల జాగ్రత్తలు వహించాలి. పోలీసు అధికారులకు సహకరించాలి.

– పరితోష్ పంకజ్, జిల్లా ఎస్పీ